ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

మహబూబాబాద్



భక్తిశ్రద్ధలతో రంజాన్

- ఈద్గాల్లో ముస్లింల ప్రత్యేక ప్రార్థనలు
- పండుగ ప్రాధాన్యాన్ని వివరించిన మతపెద్దలు
- ఆలింగనం చేసుకొని పరస్పర శుభాకాంక్షలు
- మానుకోట, మరిపెడలో ఎమ్మెల్యే మురళీనాయక్, ప్రభుత్వ విప్ రాంచంద్రునాయక్ హాజరు

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, ఏప్రిల్ 11 : జిల్లా వ్యాప్తంగా రంజాన్ పర్వదినాన్ని గురువారం ముస్లిం సోదరులు ఘనంగా జరుపుకున్నారు. మానుకోట పట్టణంతో పాటు మండల కేంద్రాలు, గ్రామాల్లో ఈద్ ఉల్‌ఫిత్ర్‌ను భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. మార్చి 12వ తేదీన ప్రారంభించుకున్న రంజాన్ ఉపవాసాలు ఈనెల 10తో 30 రోజులపాటు కొనసాగాయి. దీంతో బుధవారం నెలవంక కన్పించడంతో రంజాన్ పండుగను జరుపుకున్నారు.

ఈద్గా మైదానంలో..

మానుకోట పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల సమీపంలోని

మిగతా 8వ పేజీలో



మానుకోటలోని ఈద్గా మైదానంలో రంజాన్ పర్వదినం సందర్భంగా ప్రసంగిస్తున్న గౌసియా మసీద్ ఇమామ్‌మప్మూద్ సయీద్ అహ్మద్ రిజ్వీ. ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

ప్రార్థనలు చేస్తున్న ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్



మరిపెడ ఈద్గా వద్ద ముస్లింలకు శుభాకాంక్షలు తెలుపుతున్న ప్రభుత్వవిప్, డోర్నకల్ ఎమ్మెల్యే రాంచంద్రునాయక్



మహబూబాబాద్‌లో ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలుపుతున్న కేంద్ర మాజీమంత్రి బలరాంనాయక్

శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే, కేంద్ర మాజీమంత్రి..

మహబూబాబాద్ పట్టణంలోని ఈద్గా, ఆబాది ఈద్‌గాహ్ మైదానాల్లో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మత పెద్దలు ముస్లింలచే నమాజ్ చేయించిన అనంతరం స్థానిక ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్, మాజీ కేంద్రమంత్రి పోరిక బలరాంనాయక్ ఈద్గా మైదానంలో జరిగిన ప్రార్థనలో పాల్గొని, ముస్లింలను ఆలింగనం చేసుకొని శుభాకాంక్షలు తెలి పారు. మునిసిపల్ చైర్మన్ పాల్వాయి రామ్మోహన్‌రెడ్డి, వైస్ చైర్మన్ మార్నేని వెంకన్న, నాయకులు ఘనపురపు అం జయ్య, చుక్కల ఉదయ్‌చందర్, ఎడ్ల రమేష్, మార్నేని రఘు, మార్నేని కిరణ్, నిమ్మల శ్రీను, చెలమల్ల నారాయణ ముసీంలకు శుభాకాంక్షలు తెలిపారు. డీఎస్పీ తిరుపతి రావు నేతృత్వంలో సీఐ పెండ్యాల దేవేందర్ బందోబస్తు నిర్వహించారు.



వేలుబెల్లిలో మాట్లాడుతున్న సీతక్క

కాంగ్రెస్ పార్టీని ప్రజలు ఆదరించాలి

- దేశానికి రాహుల్ గాంధీ నాయకత్వం అవసరం
- ఎంపీగా బలరాంనాయక్‌ను గెలిపించాలి
- తెలంగాణలో బీఆర్ఎస్ లేదు, దేశంలో రాదు
- పంచాయతీ రాజ్, స్త్రీ, శిశు సంక్షేమ శాఖమంత్రి సీతక్క

కొత్తగూడ, ఏప్రిల్ 11 : దేశానికి ప్రస్తుతం రాహుల్‌గాంధీ నాయకత్వం అవసరమని, ఆయన ప్రధానమంత్రి కావాలంటే మహబూబాబాద్ ఎంపీగా బలరాంనాయక్‌ను గెలిపించాలని పంచాయతీ రాజ్ శాఖమంత్రి సీతక్క పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్రాన్నిచ్చిన కాంగ్రెస్ పార్టీని ప్రజలు ఆదరించి, ఎన్నికల్లో గెలిపిచాలన్నారు. కొత్తగూడ మండలం వేలుబెల్లిలో కాంగ్రెస్ పార్టీ ముఖ్యనాయకుల, కార్యకర్తల సమావేశం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వజ్జ సారయ్య అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నాలుగు నెలల్లో గ్యారెంటీలను అమలు చేశామన్నారు. చిన్న, సన్నకారు రైతుల అకౌంట్‌ల్లో రైతుబంధ్ వేశామన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు అవినీతి పరులు ఉన్నవారు బీజేపీలో చేరగానే సర్ఫ్‌తో ఉతికినట్టు నీతిపరులుగా మారుతున్నారని ఎద్దేవా చేశారు. వారికి పదవులను సైతం అప్పగిస్తున్నారని విమర్శించారు. నిత్యావసర సరుకులు, వస్తువులు, దుస్తులపై మోదీ ప్రభుత్వం అధిక పన్నులు వేస్తు వేధిస్తున్నారని ఆరోపించారు. ఎన్నికల కోడ్‌తో రాష్ట్రంలో అభివృద్ధి పనులు ఆగిపోయాయని పేర్కొన్నారు. బీఆర్ఎస్ తెలంగాణరాష్ట్రంలో లేదు, దేశంలో రాదన్నారు. బలరాంనాయక్ కేంద్రమంత్రిగా ఉన్నప్పుడు మహబూబాబాద్ పార్లమెంట్ పరిధిలో పలు అభివృద్ధి పనులు చేశారన్నారు. గురుకుల పాఠశాలలు తీసుకువచ్చారు, రోడ్లు వేయించారు, వంతెనలు నిర్మించారని పేర్కొన్నారు. గత పదేళ్లుగా ఎంపీలుగా చేసినవారు ఎలాంటి అభివృద్ధి చేయలేదని ఆరోపించారు. ఎవరు ఎంపీగా పోటీ చేసినా రాహుల్ గాంధీని పీఎం చేయడం లక్ష్యంగా భావించి బలరాం నాయక్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించుకోవాలన్నారు.

కొత్తగూడ, గంగారం అభివృద్ధికి కృషి చేస్తా..

- మహబూబాబాద్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి బలరాంనాయక్

మంత్రి సీతక్కతో కలిసి కొత్తగూడ, గంగారం మండలాల అభివృద్ధికి కృషి చేస్తానని మాజీ కేంద్ర మంత్రి, కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి బలరాంనాయక్ పేర్కొన్నారు. బీఆర్ఎస్ పార్టీ రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసిందని, కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ప్రజాసంక్షేమాని కృషి చేస్తోందన్నారు. తనకు ఓటువేస్తే రాహుల్ గాంధీకి ఓటు వేసినట్టేనని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రం ఇచ్చిన కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి, సోనియాగాంధీ రుణం తీర్చుకోవాలన్నారు.

ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ ములుగు జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్, ఎన్నికల ఇన్‌చార్జి అనిల్, జడ్పీటీసీలు పుష్పలత, రమ, ఎంపీపీ బానోత్ విజయ రూప్‌సింగ్, టీపీసీసీ ఆర్గనైజింగ్ సెక్రటరీ చల్లా నారాయణరెడ్డి, సర్పంచ్ వజ్జ వెంకటలక్ష్మి సురేందర్, నాయకులు సుంకరబోయిన మొగిలి, వెంకన్న, అల్లాడి రాజు, వజ్జ రాకేష్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జోరుగా.. ఉపాధి పనులు

- జిల్లా వ్యాప్తంగా 2,16,680 మందికి జాబ్‌కార్డులు
- ఈనెల 1వ తేదీ నుంచి కూలీ రూ.300 పెంపు
- పని ప్రదేశంలో కనిపించని షెడ్‌నెట్, ప్రథమ చికిత్స కిట్లు



మండలం	జాబ్‌కార్డులు	హాజరైన కూలీలు
బయ్యారం	15920	34085
చిన్నగూడూరు	6038	11154
దంతాలపల్లి	9946	21592
డోర్నకల్	16349	32181
గంగారం	3729	8689
గార్ల	11126	24255
గూడూరు	20238	41754
కేసముద్రం	20811	43203
కొత్తగూడ	9343	20938
కురవి	19438	40522
మహబూబాబాద్	15232	30274
మరిపెడ	18552	38447
నర్సింహులపేట	10411	22373
నెల్లికుదురు	18221	40554
పెద్దవంగర	7765	18157
తొర్రూరు	13561	29301
మొత్తం	2,16,680	4,57,479

మహబూబాబాద్ రూరల్, ఏప్రిల్ 11 : మండువేసవిలో ఉపాధి హామీ పనులు జోరుగా సాగుతున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో వృద్ధులు, యువకులు, మహిళలు, యువతులు ఉత్సాహంగా పాల్గొంటున్నారు. మహబూబాబాద్ జిల్లాలోని 18 మండలాల్లో 2,16,680 మందికి జాబ్‌కార్డులు ఉండగా, 4,57,479 లక్షల మంది ఉపాధిహామీ పనులు చేస్తున్నారు. కూలీలు పనిచేసే చోట వారి పిల్లలు ఆడుకోవడానికి జిల్లాలో ఎక్కడ కూడా ఎండ తీవ్రతను తట్టుకునేందుకు షెడ్‌నెట్ సౌకర్యం కల్పించడం లేదు. ఏదైనా ప్రమాదం జరిగితే ప్రథమ చికిత్స అందించేందుకు కిట్లు సైతం అందుబాటులో లేవు. ఉపాధిహామీ పనులకు కూలీలు తాగునీరు తీసుకుని వస్తే రూ.5 ప్రతిరోజు అదనంగా కలిపి ఇస్తామంటూ ఈజీఎస్ అధికారులు చెబుతున్నారే కానీ, ఎక్కడా ఈ హామీని అమలు చేయడం లేదు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో కూలీలకు గరిష్టంగా రూ.272 అందిస్తుండగా 2024-25 సంవత్సరంలో కేంద్ర ప్రభుత్వం ఏప్రిల్ 1వ తేదీ నుంచి ఉపాధి హామీలో పనిచేస్తున్న కూలీలకు రోజుకు రూ.300 చొప్పున చెల్లిస్తామంటూ ఉత్తర్వులు జారీ చేశారు.

రోజు కూలీ రూ.300

జిల్లాలో 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులు ఉపాధిహామీ పనులు చేయాలనుకుంటున్న కూలీలు జాబ్‌కార్డును పొందాల్సి ఉంటుంది. కూలీలు తమయొక్క ఆధార్‌కార్డు, బ్యాంకు పాస్‌పుస్తకం, ఇతరవివరాలతో కూడిన వాటిని గ్రామపంచాయతీ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శికి, మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవోకు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఆ దరఖాస్తును పరిశీలించిన తర్వాత జాబ్‌కార్డులు మంజూరు చేయడం జరుగుతుంది. ఈ జాబ్‌కార్డు మంజూరైన తేదీ నుంచి ఆర్థిక సంవత్సరంలో వంద రోజులు పనిచేయాల్సిన అర్హత లభిస్తోంది. ఒక్కొక్క కుటుంబంలో ఒక్కొక్క జాబ్‌కార్డు మాత్రమే మంజూరు చేయడం జరుగుతుంది. వివాహం కానీ యువతీయువకులు తల్లిదండ్రుల జాబ్‌కార్డులో తమ పేర్లు నమోదు చేయించుకోవాల్సి ఉంటుందని డీఆర్‌డీఏ అధికారులు చెబుతున్నారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర ప్రభుత్వం, కేంద్రప్రభుత్వం ఉపాధిహామీ పథకం కింద గరిష్టంగా రూ.272 చెల్లించే వారు ప్రస్తుతం 2024-25 సంవత్సరానికి గాను ఏప్రిల్ 1 నుంచి రూ.300 పెంచుతూ ఉత్తర్వులు జారీ చేశారు.

260 రకాల పనులకు అనుమతి..

కేంద్రప్రభుత్వం జాతీయ ఉపాధిహామీ పథకంలో 260 రకాల పనులకు అనుమతి ఇవ్వడం జరిగింది. సహజవనరుల నిర్వహణ, వ్యక్తిగత ఆస్తుల నిర్మాణం, గ్రామీణ మౌళిక సదుపాయాల కల్పన, నీటి ఊట చెరువులు, గుట్టల చుట్టు కంధకాలు తీసుట, ఖాళీ బంజార భూముల్లో నీటినిల్వల కంధకాలు, పశువుల పాక, గొర్రెల పాక, కోళ్లపాక, పండ్ల తోటల పెంపకం, మొక్కల పెంపకం, ఇంకుడు గుంతల నిర్మాణం, చెరువులు, కుంటల్లో పూడికతీత పనులు, శ్మశాన వాటిక నిర్మాణాలాంటి పనులను ఉపాధిహామీ పనుల కింద నిర్మించుకోవచ్చు.

ఎక్కడా కనిపించని షేడ్‌నెట్.. ప్రథమ చికిత్స కిట్లు..

ఉపాధిహామీ పనులు జరుగుతుండగా పని ప్రదేశంలో ఎండ తీవ్రతను తట్టుకునేందుకు చిన్నపిల్లలు ఆడుకోవడానికి షెడ్‌నెట్ సౌకర్యం కల్పించాల్సి ఉంది. కానీ, జిల్లాలో 461 గ్రామ పంచాయతీల్లో ఎక్కడ కూడా సెడ్‌నెట్ సౌకర్యం కల్పించడం లేదు. కేంద్ర ప్రభుత్వం నిబంధనలో ఉన్నప్పటికి ఫీల్డ్ అసిస్టెంట్‌లు, టీఏలు, ఏపీవోలు, ఎంపీడీవోలు, డీఆర్‌డీఏ అధికారులు వాటిని పట్టించుకోవడం లేదనే విమర్శలు విన్పిస్తున్నాయి. పనిచేసే చోట తేలు, పాము, విష పురుగుల కాటుకు గురైన కూలీలకు తక్షణ వైద్యం కోసం ప్రథమ చికిత్స కిట్లు ఏర్పాటు చేయాల్సి ఉంది. కానీ, అవి ఎక్కడా కన్పించడం లేదు.



ఉపాధి హామీతో రోజూ పని దొరుకుతుంది..

హెచ్.లచ్చమ్మ, కూలి, అయోధ్య, మానుకోట

మహాత్మాగాంధీ జాతీయ ఉపాధిహామీ పథకం ద్వారా గ్రామంలోనే ప్రతి రోజు కూలి పని దొరుకుతుంది. ఈ పనులకు వెళ్లడం ద్వారా వారంరోజుల్లో చేసిన పనికి ఒకేసారి డబ్బులు చెల్లిస్తున్నారు. ఉపాధిహామీ పథకంలో పని దొరకడంతో కుటుంబాలను పోషించుకుంటున్నాం. వందరోజులు పనిచేయడం ద్వారా సుమారు రూ.16 వేల వరకు పొందాను.

గొప్ప విప్లవ కళాకారుడు కానూరి

- అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య జిల్లా కార్యదర్శి వెంకన్న

మహబూబాబాద్ రూరల్, ఏప్రిల్ 11 : తెలుగు రాష్ట్రాల్లో విప్లవ ప్రజా పోరాటాల్లో ఆడిపాడి తన గళంద్వారా ప్రజలను చైతన్యపరిచిన గొప్ప కళాకారుడు కానూరి వెంకటేశ్వర్‌రావు అని అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య జిల్లా కార్యదర్శి ఈర్ల వెంకన్న కొనియాడారు. మానుకోట పట్టణంలోని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా కార్యాలయంలో గురువారం కానూరి వెంకటేశ్వర్‌రావు వర్ధంతిని నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం నుంచి శ్రీకాకుళం గిరిజన ఉద్యమం, గోదావరి లోయ రైతాంగ ప్రతిఘటన పోరాటాల వరకు ప్రజాకళలను అభివృద్ధి చేసిన ఆదిగురువు కానూరి అని పేర్కొన్నారు. ఆయన ఆశయ సాధన కోసం ప్రతీ ఒక్కరు కృషి చేయాలని చెప్పారు. సమావేశంలో జిల్లా సహాయ కార్యదర్శి కొత్తపల్లి రవి, చారి హరీష్, పైండ్ల యాకయ్య, అవుల కట్టయ్య, మల్లేష్, రాజు, వీరన్న పాల్గొన్నారు.

గూడూరు ఏజెన్సీలో కార్చిచ్చు..

గూడూరు, ఏప్రిల్ 11 : ఏజెన్సీ ప్రాంతంలోని అటవీకి నిప్పుపడి తరుచూ ఎక్కడో ఒకచోట మంటలు చేలరేగుతున్నాయి. తాజాగా జంగుతండా అటవీప్రాంతంలో గురువారం మధ్యాహ్నం అటవీ ప్రాంతంలో కార్చిచ్చు రగులుకుంది. మంటలు వ్యాపించాయి. దీంతో ఎంతో విలువైన చెట్లు కాలిపోయాయి. ఇలాంటి సంఘటనలను నివారించేందుకు గూడూరు ఎఫ్ఆర్వో సురేష్, అటవీశాఖ, సైకింగ్‌ఫోర్స్ బేస్‌క్యాంప్ సిబ్బందిని అప్రమత్తం చేశారు. అటవీకి నిప్పంటుకున్న ప్రదేశాల్లో బ్లోయర్ల ద్వారా మంటలను అదుపుచేస్తున్నారు. అటవీకి నిప్పంటించే వారి వివరాలు తెలిపితే వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని అధికారులు తెలిపారు.



జంగుతండాలో అటవీప్రాంతంలో చెలరేగిన మంటలు

నెల్లికుదురులో రోడ్డుపైనే సంత

- ప్రతీ సోమవారం అంగడితో ప్రజల ఇబ్బంది
- ప్రభుత్వ స్థలంలో ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి

నెల్లికుదురు, ఏప్రిల్ 11 : మండల కేంద్రంలోని అంబేడ్కర్ సెంటర్‌లో ప్రధాన రహదారి పక్కన సంత నిర్వహిస్తోండటంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. నెల్లికుదురు మండల కేంద్రంలో ప్రతీ సోమవారం అంగడి జరుగుతోంది. రోడ్డుకు ఇరువైపులు వ్యాపారస్తులు పండ్లు కూరగాయలు, బట్టలు, గాజులు అమ్ముకుంటుండటంతో రహదారి రద్దీగా మారుతుంది. రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది. స్థలం ఇరుకుగా ఉండటంతో గొర్రెల వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రతీ సోమవారం సంతకు మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన గ్రామస్తులు వందలాదిగా తరలివచ్చి వస్తువు లను కొనుగోలు చేస్తారు. ఈ క్రమంలో సంతకు రోజురోజుకు ప్రజల తాకిడి పెరిగింది. మండల కేంద్రంలో ప్రభుత్వ స్థలాలు ఉన్నప్పటికి సంతకు ప్రత్యేక స్థలం కేటాయిచించకపోవడం దారుణం. నాలుగు ఎకరాల ప్రభుత్వ స్థలంలో సంతను ఏర్పాటు చేస్తే.. చిరువ్యాపారాలతో పాటు పశువులు, గొర్రెల వ్యాపారం నిర్వహించవచ్చని గ్రామస్తులు అధికారులను కోరుతున్నారు. రోడ్డుపైనే సంత నిర్వహించడం వలన తరచూ ప్రమాదాలు జరుగుతన్నాయని, సంతను వేరే చోటుకి తరలించాలని గ్రామస్తులు కోరు తున్నారు. సంతను వేలంవేసి నిర్వహిస్తున్న అధికారులు సంతను వేరే స్థలానికి తరలించడానికి నిర్లక్ష్యం వహిస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి.



నెల్లికుదురు అంబేద్కర్ సెంటర్‌లో కొనసాగుతున్న సంత

నిలిచిన పశువులు, గొర్రెల వ్యాపారం..

ముప్పై సంవత్సరాల నుంచి నెల్లికుదురులో సంతకొనసాగుతోంది. అప్పట్లో అన్నిరకాల వ్యాపారస్తులతో పాటు పశువులు, గొర్రెల వ్యాపారులు సంతకు వచ్చి క్రయవికరయాలు నిర్వ హించేవారు. అంగడికి ప్రత్యేకమైన స్థలం కేటాయించకపోవడంతో గత ఐదేళ్ల నుంచి పశువులు, గొర్రెలు, మేకల సంత నిర్వహించడం లేదు. గతంలో నెల్లికుదురు మండలంతో పాటు నర్సింహులపేట, తొర్రూరు, ఇనుగుర్తి, మహబూబాబాద్ మండలాల నుంచి పశువులు, గొర్రెల వ్యాపారస్థులు తరలివచ్చి వ్యాపారాలు నిర్వహించేవారు. దీంతో అంగడి వేలంపాట పెరిగేది. గ్రామపంచాయతీకి ఆదాయమూ సమకూరేది. పశువుల సంత నిర్వహించకపోవడంతో పశువులును, గొర్రెలను సుదూరప్రాంతాలకు వెళ్లి క్రయవిక్ర యాలు చేయవలసిన పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా సంతకు ప్రభుత్వ స్థలం కేటాయించి, అభివృద్ధి చేయాలని స్థానికులు కోరుతున్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న బీజేపీ మానుకోట అభ్యర్థి సీతారాంనాయక్, పక్కన వరంగల్ ఎంపీ అభ్యర్థి అరూరి రమేష్, గరికపాటి మోహన్‌రావు

మోదీ బృందంలో ఉండే అవకాశం ఇవ్వండి..

- ఇద్దరం ఉమ్మడి జిల్లా అభివృద్ధికి కృషి చేస్తాం..
- వరంగల్ కోసం మోదీ ఎంతో చేశారు
- మాల, మాదిగలను అణగదొక్కిన కడియం
- కావ్యకు వరంగల్‌తో ఏం సంబంధం? ఆమె మెట్టినిల్లు గుంటూరు
- హామీలు నెరవేర్చని కాంగ్రెస్
- బీజేపీ లోక్‌సభ అభ్యర్థులు సీతారామ్‌నాయక్, అరూరి రమేష్

వివరాలు 7లో..

పూలేకు ఘన నివాళి

- మహిళల విద్యకు చైతన్య దీప్తి మహాత్మా జ్యోతిరావు పూలే
- సేవలను కొనియాడిన వక్తలు

8లో..



పూలే విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న బీసీ ఉద్యోగుల సంఘం బాధ్యులు















హనుమకొండ జిల్లా ఖజానా కార్యాలయం

‘ఖజానా’లో పని భారం

100 మంది ఉద్యోగులు చేయాల్సిన పనికి 45మందే దిక్కు

35వేల పై చిలుకు ఉద్యోగులకు ఇక్కడినుంచే జీతాలు చెల్లింపు

హనుమకొండ కలెక్టరేట్, ఏప్రిల్ 11: హైదరాబాద్ ఖజానా కార్యాలయం తర్వాత రాష్ట్రంలోనే రెండో అతిపెద్ద ఖజానా కార్యాలయమైన హనుమకొండ జిల్లా ఖజానా కార్యాలయంలో ఉద్యోగుల కొరత తీవ్రంగా ఉంది. ఇక్కడి కార్యాలయంలో 100 మంది ఉద్యోగులు చేయాల్సిన పనిని.. 45 మంది ఉద్యోగులే చేస్తూ అధిక పనిభారంతో తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఉన్న ఆరు జిల్లాల ఖాజానా కార్యాలయాలలో 5 జిల్లాల ఖజానా కార్యాలయాల ఉద్యోగులు చేసే పనిని ఒక్క హనుమకొండ జిల్లా కార్యాలయ ఉద్యోగులు చేస్తున్నారంటే వారిపై ఎంత పనిభారం ఉందో అర్థమవుతోంది.

అన్నీ నుంచే..

జిల్లాలోని కొందరు ప్రభుత్వ ఉద్యోగులతో పాటు రిటైర్డ్ అయిన ఉద్యోగులకు పెన్షన్లు ఈ కార్యాలయం నుంచే ఇస్తారు. 15వేల మంది ఉద్యోగస్థులకు, 16వేల మంది పెన్షనర్లకు, 1200 మంది హోంగార్డులకు, 1500 మంది మున్సిపల్ సిబ్బందికి, 1000 మంది గ్రాంటినేట్ స్కూల్ టీచర్లకు, 500 మంది అంగన్‌వాడీ వర్కర్లకు జీతాలు(35వేల పైచిలుకు ఉద్యోగులకు) ఇక్కడి నుంచే చెల్లిస్తారు. దీంతో పాటు జిల్లాలోని 110 గ్రామ పంచాయతీల సిబ్బందికి వేతనాలతో పాటు సాధారణ నిధులు కూడా ఇక్కడి నుంచే విడుదలవుతాయి.

అన్ని రోజులూ పనిదినాలే...


ఖజానా కార్యాలయంలో ఉద్యోగుల కొరత ఉండటంతో ఆదివారాలు, పండగ రోజులు కూడా ఉద్యోగాలు చేయాల్సిన దుస్థితి దాపురించింది. నూతన పెన్షన్ విధానం, ఆదాయ పన్ను రిటర్న్స్‌కు సంబంధించిన పనులు, క్యాష్ ఇన్ జీపీఎఫ్ చెల్లింపులు కూడా ఇక్కడి నుంచే చేస్తుండటంతో ఎక్కువ పనిభారంతో సతమతమవుతున్నామని ఖజానా కార్యాలయ ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఖజానా కార్యాలయంలో సరిపడా ఉద్యోగులను కేటాయించాలని కోరుతున్నారు.


పెన్షన్ పేమెంట్ ఆఫీస్ ఏర్పాటు చేయాలి

రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు ఇ.నరసింహారెడ్డి



హనుమకొండ జిల్లాలో 16వేల మంది పెన్షనర్లు ప్రతీ నెల పెన్షన్ తీసుకుంటున్నారు. ప్రస్తుతం జిల్లా ఖజానా కార్యాలయంలో ఉద్యోగుల కొరత ఉండటంతో పెన్షనర్లకు ఇబ్బంది ఎదురవుతోంది. ఖజానా కార్యాలయ ఉద్యోగులకు పనిభారం తగ్గాలంటే పెన్షన్ పేమెంట్ ఆఫీస్ ప్రత్యేకంగా ఏర్పాటు చేయాలి. ఇలాంటి ఆఫీస్‌లు హైదరాబాద్‌లో మాత్రమే ఉన్నాయి. హైదరాబాద్ తర్వాత ఎక్కువ పెన్షనర్లు ఉన్న మన హనుమకొండ జిల్లాలో కూడా పెన్షన్ పేమెంట్ ఆఫీస్ ప్రత్యేకంగా ఏర్పాటు చేయాలి.







ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న ఖదిజ్ఞాసి లోక్‌నాథ్

ఓటు అమ్ముకుంటే ఐదేళ్లు అధోగతే..

జైభారత్ జాతీయ కార్యదర్శి ఖదిజ్ఞాసి లోక్‌నాథ్

వడ్డెపల్లి, ఏప్రిల్ 11 : నోటుకు ఓటు అమ్మకుంటే ఐదేళ్ల భవిష్యత్ అధోగతేనని జైభారత్ జాతీయ కార్యదర్శి ఖదిజ్ఞాసి లోక్‌నాథ్ అన్నారు. గురువారం బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. డబ్బుకు ఓటు అమ్ముకుంటే బతికి ఉన్నా శవంతో సమానమన్నారు. ధన రాజకీయాలకు ఎన్నికల్లో సమాధి కట్టాలని ప్రజలకు పిలుపు నిచ్చారు. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించే బాధ్యత ఓటర్లపైనే ఉందని చెప్పారు. సమావేశంలో జై భారత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఖదిజ్ఞాసి సత్యనారాయణ గోల, రాష్ట్ర నేత ఖదిజ్ఞాసి వీరయ్య, సాంబశివ రావు, గగన్ తదితరులు పాల్గొన్నారు.

మెట్టుగుట్ట ఆలయాలను విలీనం చేయవద్దు..

రామాలయ అర్చకుడు విష్ణువర్ధనాచార్యులు ఆత్మహత్యాయత్నం



మెట్టుగుట్ట ఆలయాలను విలీనం చేయవద్దని తీర్మానం చేస్తున్న ఈవో, చైర్మన్, అర్యకులు, ధర్మకర్తలు, భక్తులు

మడికొండ, ఏప్రిల్ 11: మడికొండలోని మెట్టుగుట్టపై హరిహర క్షేత్రంగా విలసిల్లుతున్న మెట్టురామలింగేశ్వరస్వామి, సీతారామచంద్రస్వామి ఆలయం అర్చకుడు పరాశరం విష్ణువర్ధనాచార్యులు ఆలయంలోనే ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సమీంపంలో ఉన్న కొందరు గమనించి వారించి నచ్చజెప్పి ఈవోకు సమాచారం అందించారు. కాగా, మడికొండలోని మెట్టుగుట్టపై హరిహర క్షేత్రంగా విలసిల్లుతున్న మెట్టురామలింగేశ్వరస్వామి, సీతారామచంద్రస్వామి ఆలయాలకి సంబంధించిన రెండు కమిటీలు ఉంటాయి. ప్రస్తుతం రామాలయానికి సంబంధించిన భూమిని రైల్వే వ్యాగన్ వర్క్‌షాప్ ఎనకు అమ్మగా కోట్ల రూపాయల నిధులు వచ్చాయి. ఆ నిధులపై కన్నేసిన దేవాదాయ శాఖ అధికారులు, ఈవో, శివాలయం అర్చకులు, చైర్మన్‌లు.. రామాలయం, శివాలయం రెండింటినీ విలీనం చేసి నిధులను ఇతర అవసరాలకు మళ్లించేందుకు నిర్ణయాలు తీసుకుంటున్నారని స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. కాగా, ఆలయాలను విలీనం చేయవద్దని నిరసన వ్యక్తం చేస్తూ అర్చకుడు అఘాయిత్యానికి పాల్పడ్డాడు.

దీనిపై ఈవో శేషుభారతి ఆలయ చైర్మన్, అర్చకులు, ధర్మకర్తలు, స్థానికులతో అత్యవసర సమావేశం ఏర్పాటు చేసి సమీక్షించారు. ప్రస్తుతానికి ఆలయాల విలీనం వంటి చర్యలు ఏవీ చేయడంలేదని తీర్మానం చేసినట్లు స్పష్టం చేశారు. అలాగే రామాలయ అర్చకులకు పే స్కేల్ వచ్చే విధంగా ఉన్నతాధికారులకు నివేదిస్తామని తెలిపారు. కార్యక్రమంలో చైర్మన్ పైడిపాల రఘుచందర్, అర్చకులు రాగిచేడు అభిలాష్‌శర్మ, ధర్మకర్తలు, కరుణాకర్‌రెడ్డి, నర్సింగ్ తదితరులు పాల్గొన్నారు.

ఊరిస్తున్న విమానం!

దశాబ్దాలుగా నెరవేరని గగన విహారం ● భూసేకరణ, 150కి.మీ నిబంధనల అడ్డంకి దాటితేనే మార్గం సుగమం

వరంగల్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : ఓరుగల్లు వాసులకు 'విమానం' ఊరిస్తోంది. గగన విహారం కలగానే మిగులుతోంది. చిన్న నగరాలకు రాష్ట్ర రాజధానులు, ఢిల్లీతో ఎయిర్ కనెక్టివిటీ పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఉడాన్ పథకం ఉత్తుత్తిగానే మిగిలిపోతోంది. అయితే ఉమ్మడివరంగల్ జిల్లా అభివృద్ధికి ఎంతో కీలకంగా ఉంటుందన్న లక్ష్యంతో మామునూరు ఎయిర్‌పోర్టుకు 2021లోనే ఎయిర్‌పోర్టు అథారటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ) సూత్రప్రాయంగా అనుమతులిచ్చింది. అయితే ఎయిర్‌పోర్టుల నిర్మాణానికి కావాల్సిన భూసేకరణతో పాటు హైదరాబాద్ విమానాశ్రయానికి 150కిలో మీటర్ల పరిధిలో మరో విమానశ్రాయం నిర్మించవద్దనే ఒప్పందం వరంగల్ ఎయిర్‌పోర్టుకు శాపంగా మారుతుంది. అయితే తాజాగా వారం రోజులుగా మామునూరు ఎయిర్‌పోర్టులో విమానాలు సందడి చేస్తున్నాయి. మూడు సర్వే విమానాలు మామునూరు రన్‌వేపై దిగటంతో విమానశ్రాయం కల సాకారమవబోతోందన్న ఆశలు చిగురిస్తున్నాయి.



ఎయిర్‌పోర్టుకు కేటాయించిన భూమి

నిజాంకాలం నుంచే ఎయిర్‌పోర్టు..

నిజాం కాలంలోనే రయ్ రయ్ మంటూ విమానాలు ఎగిరిన మామునూరులో.. నేటి తరానికి గగన ప్రయాణం అందుబాటులో లేకుండాపోయింది. 1930లో చివరి నిజాం మీర్ ఉస్మాన్‌అలీ ఖాన్ మామునూరులో విమానాశ్రయం ఏర్పాటు చేశారు. షోలాపూర్‌లోని వ్యాపారాభివృద్ధికి, ఆజంజాహి వస్త్ర పరిశ్రమ, కాగజ్‌నగర్ కాగితపు పరిశ్రమలకు ఉపయోగపడేలా దీన్ని ఏర్పాటు చేశారు. 1981 వరకు మామునూరు విమానాశ్రయం ద్వారా రాకపోకలు జరిగాయి. 1970లో భారత్, చైనా మధ్య జరిగిన యుద్ధం సందర్భంగా ఢిల్లీలో విమానాలు దిగే పరిస్థితి లేనప్పుడు కూడా మామునూరు నుంచే సైన్యాన్ని పంపారు. కార్గిల్ యుద్ధ సమయంలో కూడా ఢిల్లీ ఎయిర్‌పోర్టుకు ప్రత్యామ్నాయంగా మామునూరు ఎయిర్‌పోర్టును వాడుకునేందుకు సిద్ధం చేశారు. ఇలాంటి చరిత్ర ఉన్న మామునూరు విమానాశ్రయం ఓరుగల్లువాసులకు మాత్రం ఉపయోగపడటం లేదు. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం మామునూరు విమానాశ్రయాన్ని బ్రౌన్ ఫీల్డ్ ఎయిర్‌పోర్టుగా అభివృద్ధి చేసేందుకు ముందుకు వచ్చింది. 2017 ఏప్రిల్ 27న ఉడే దేశ్‌కీ ఆమ్ నాగరిక్ (ఉడాన్) పథకం కింద దేశవ్యాప్తంగా విమానాశ్రాయాలను అభివృద్ధి చేయాలని కేంద్రం నిర్ణయించింది. అయితే ఓఎల్ఎస్ సర్వే, మట్టి పరీక్షతో పాటు వివిధ సర్వే సంస్థల నివేదికలతో పాటు టెక్నో ఎకనామికల్ ఫీజిబిలిటీ స్టడీ రిపోర్టును ఎయిర్‌పోర్టు అథారటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ)పూర్తి చేసి గతేడాది జూలై 7వ తేదీన కేంద్ర ప్రభుత్వానికి నివేదికలు ఇచ్చింది. దీంతో మామునూరు ఎయిర్‌పోర్టుకు అన్ని రకాల అనుమతులు లభించాయి.

భూసేకరణ, 150కి.మీ నిబంధనే అడ్డంకి..

'అంగట్లో అన్ని ఉన్న అల్లుడి నోట్లో శని' అనే చందంగా మామునూరు ఎయిర్‌పోర్టుకు అన్ని అనుమతులున్న భూసేకరణ, 150కిలో మీటర్ల నిబంధన ప్రతిబంధకంగా మారింది. నిజాం కాలంలో 1,875ఎకరాల భూమిని ఎయిర్‌పోర్టు కోసం కేటాయించారు. ఇందులో 435ఎకరాల భూమిని టీఎస్ఎస్‌పీ ఫోర్తు బెటాలియన్ క్యాంపునకు కేటాయించారు. ఇందులో నుంచే జవహర్ నవోదయ విద్యాలయానికి 23.20ఎకరాలు, పోలీస్ శిక్షణ కళాశాలకు 59ఎకరాలు, ఏసీపీ కార్యాలయానికి పదెకరాలు, వరంగల్ సెంట్రల్ జైలుకు 101 ఎకరాలు కేటాయించారు. ఇక ఫోర్త్ బెటాలియన్‌కు మిగిలింది కేవలం 241.24ఎకరాలు. మరో 675 ఎకరాల భూమిని వెటర్నరీ యూనివర్సిటీకి కేటాయించారు. రోడ్డు, ఇతర వాటికి పోగా ప్రస్తుతం 696 ఎకరాల స్థలం ఎయిర్‌పోర్ట్ ఆథారిటీ ఆఫ్ ఇండియా ఆధీనంలో ఉంది. అయితే ఎయిర్‌పోర్టుకు 1,200ఎకరాల భూమి అవసరం. ఇంకా 504ఎకరాల భూమిని సేకరించి ఇవ్వాల్సి ఉంది. 2023 జూలై నెలలో 249 ఎకరాలు వెటర్నరీ యూనివర్సిటీ పక్కనే ఉన్న భూమి సేకరించి ఎయిర్‌పోర్టుకు ఇచ్చేందుకు గత ప్రభుత్వ మంత్రివర్గం ఆమోదించింది. మిగతా భూమిని చుట్టుపక్కల గ్రామాల నుంచి రైతుల భూములు సేకరించాలని నిర్ణయించారు. అయితే ఎయిర్‌పోర్టుకు భూమిని అప్పగించేందుకు రైతులు ససేమిరా అంటున్నారు. దీంతో విమానాశ్రయ ఏర్పాటుకు తీవ్ర ఆటంకం ఏర్పడుతోంది. అలాగే హైదరాబాద్ విమానాశ్రయాన్ని నిర్వహిస్తున్న జీఎంఆర్ సంస్థతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఒప్పందం మేరకు 150కి.మీ నిడివిలో ఇంకో వాణిజ్య విమానాశ్రయం ఉండకూడదనే నిబంధన ఉంది. ఈ నిబంధన ప్రకారం శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు మామునూరు 150కిలో మీటర్ల లోపే ఉంది. దీంతో 2038వరకు మామునూరు ఎయిర్‌పోర్టుకు మోక్షం లభించదనే నిరాశ ఓరుగల్లు వాసుల్లో నెలకొంది. అయితే ప్రభుత్వం చొరవచూపించి జీఎంఆర్ సంస్థ ప్రతినిధులతో మాట్లాడి, నిబంధనలను సడలించాలనే ప్రజలు చేస్తున్న విజ్ఞప్తిని పట్టించుకునే వారు లేరు.

ఆశలు రేకెత్తిస్తున్న విమానాల సందడి..

మామునూరు ఎయిర్‌పోర్టులో గురువారం మూడు హెలికాప్టర్లు సందడి చేశాయి. వారం రోజులుగా ఒకటి రెండు విమానాలు మామునూరు ఎయిర్‌పోర్టులో ల్యాండ్ కావటం, గగన విహారం చేయటం జరుగుతోంది. అయితే వాటిని ఎన్‌సీసీ విభాగానికి చెందిన హెలికాప్టర్లుగా భావించగా.. గురువారం మూడు హెలికాప్టర్లు ఒకేసారి మామునూరులో ల్యాండ్ కావటంతో పాటు స్కై సర్వే చేపట్టారు. మూడు హెలికాప్టర్లలో వచ్చిన సిబ్బంది జియోజికల్ సర్వే చేపట్టినట్టు అక్కడి సిబ్బంది తెలిపారు. ఏఏఐ అనుమతితో కొన్ని విమాన ప్రైవేటు కంపెనీల ప్రతినిధులు ఇక్కడ ల్యాండింగ్‌కు ఉన్న వెసులుబాటును పరిశీలించారు. ఇప్పటికే మామునూరులో 6.6కి.మీ రన్‌వేతో పాటు పైలట్, సిబ్బంది, టెర్మినల్స్‌తో పాటు సుమారు 700 ఎకరాల వరకు భూమి ఉంది. వీటిని పరిశీలించిన అధికారులు పెద్దపల్లి జిల్లా రామగుండం ఎయిర్‌పోర్టు నిర్మాణ ప్రదేశాన్ని కూడా ఎయిర్ వ్యూ చేశారు. అనంతరం మామునూరుకు చేరుకున్నారు. మరో రెండుమూడు రోజులు ఇతర సర్వేలు చేపట్టనున్నట్లు సమాచారం. అయితే ఈ సర్వేలు ఎందుకోసమో వివరించేందుకు అధికారులు నిరాకరిస్తున్నారు. కేంద్ర విమానాయ శాఖ ఆదేశాల మేరకే ఈ సర్వేలు జరుగుతుండటంతో ఓరుగల్లువాసుల్లో గగనయానంపై ఆశలు చిగురిస్తున్నాయి.

విమానయానంతో వ్యాపారాభివృద్ధి...

విమానాశ్రాయం ఏర్పడితే వరంగల్‌లోపర్యాటకంతో పాటు వ్యాపారాభివృద్ధి జరుగనుంది. పరిశ్రమలన్నీ హైదరాబాద్‌కే పరిమితమవుతుండగా.. హైదరాబాద్ తరువాత అతిపెద్ద నగరంగా ఉన్న వరంగల్‌కు పరిశ్రమల స్థాపనకు వ్యాపారులు ముందుకు రాకపోవడానికి ప్రధాన కారణం ఎయిర్‌పోర్టు లేకపోవటమేనని తెలుస్తోంది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే పారిశ్రామికవేత్తలు హైదరాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి 140కిలో మీటర్లు రోడ్డు మార్గాన వరంగల్‌కు రావాల్సి వస్తోంది. దీంతో సమయం వృథా అవుతుందనే కారణంతో పారిశ్రామికంగా అనుకూల వాతావరణం ఉన్నా విమానాశ్రయం లేకపోవటంతో వరంగల్‌లో పరిశ్రమలు రావటం లేదనే చర్చ జరుగుతోంది. వరంగల్‌లో కాకతీయ టెక్స్‌టైల్ పార్కులో పెట్టుబడులు పెట్టేందుకు అనేక విదేశీ కంపెనీలు ఆసక్తిగా ఉన్నాయి. అయితే ఢిల్లీ, హైదరాబద్‌తో ఎయిర్ కనెక్టివిటీ లేకపోవడంతో పారిశ్రామిక వేత్తలు ముందుకు రావటం లేదు. అలాగే మడికొండ ఏరియాలో ఐటీ కంపెనీల ఏర్పాటుకు కూడా ఎయిర్ కనెక్టివిటీ లేకపోవటమే కారణంగా చెబుతున్నారు. భూపాలపల్లి ఏరియాలో అపార బొగ్గు నిక్షేపాలు ఉండగా.. ఇక్కడ బొగ్గు ఆధారిత పరిశ్రమలు ఏర్పాటు చేసుకునే అవకాశం ఉన్నా విమాన మార్గం లేకపోవటంతో పారిశ్రామికవేత్తలు ముందుకు రావటం లేదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వం జీఎంఆర్ సంస్థతో చర్చలు జరిపి మామునూరు ఎయిర్‌పోర్టుకు 150కి.మీ మినహాయింపు సడలించేలా ఒత్తిడి తెచ్చి, దశాబ్దాల కల సాకారం అయ్యేలా దృష్టిపెట్టాలని ఓరుగల్లువాసులు కోరుతున్నారు.

నేడు బీజేపీ లోక్‌సభ బూత్ స్థాయి సమ్మేళనం

హనుమకొండ టౌన్, ఏప్రిల్11: వరంగల్ లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోని 7 నియోజకవర్గాల బీజేపీ బూత్ అధ్యక్షుల విజయ సంకల్ప సమ్మేళనంను శుక్రవారం మడికొండలోని సత్యసాయి కన్వెన్షన్ హాల్‌లో నిర్వహిస్తున్నట్లు వరంగల్ బీజేపీ అభ్యర్థి అరూరి రమేశ్ తెలిపారు. ప్రతీ బూత్ నుంచి సమ్మేళనంలో పాల్గొని, విలువైన సలహాలు ఇచ్చి సీటు కైవసం చేసుకునేందుకు దోహదం చేయాలన్నారు.

నిబంధనలు పాటిస్తేనే అనుమతులు



కేయూ రోడ్డులో నిర్మాణాలు పరిశీలిస్తున్న కమిషనర్

వరంగల్ కార్పొరేషన్, ఏప్రిల్ 11: బల్దియా పరిధిలో నిబంధనలు పాటిస్తేనే భవనాలకు అనుమతి పత్రాలు జారీ చేస్తామని బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అన్నారు. నిర్మాణం పూర్తయిన భవనాలకు అక్యుపెన్సీ సర్టిఫికెట్‌ల మంజూరు కోసం గురువారం నగరంలోని పలు చోట్ల క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. కేయూ మెయిన్‌గేట్, పరిమళకాలనీ, ప్రకాశ్‌రెడ్డిపేట, న్యూశాయంపేట, నక్కలగుట్ట ప్రాంతాల్లో సంబంధిత అధికారులతో కలిసి పర్యటించారు. భవణాల నిర్మాణాల పట్ల కమిషనర్ సంతృప్తి వ్యక్తం చేశారు. కమిషనర్ వెంట టౌన్ ప్లానింగ్ అధికారులు, సిబ్బంది ఉన్నారు.

33 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టివేత



పట్టుకున్న బియ్యం

వరంగల్ క్రైం, ఏప్రిల్ 11: హసన్‌పర్తి పోలీస్‌స్టేషన్ పరిధిలోని వంగపహాడ్‌లో 33క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని బుధవారం రాత్రి టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. వంగపహాడ్ గ్రామంలో ఎం.కోమల, రమక్క అనే ఇద్దరు మహిళలు పీడీఎస్ బియ్యం సేకరించి విక్రయిస్తున్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు దాడి చేశారు. దాడిలో రూ.87వేల విలువైన 33 క్వింటాళ్ల బియ్యం పట్టుకున్నారు. పట్టుకున్న బియ్యం సీజ్ చేసి ఇద్దరిపై కేసు నమోదు చేశారు. ఈ విషయాన్ని టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ ధృవీకరించారు.

మోదీ బృందంలో ఉండే అవకాశం ఇవ్వండి..

బీజేపీ లోక్‌సభ అభ్యర్థులు అజ్మీరా సీతారామ్‌నాయక్, అరూరి రమేష్

హనుమకొండ, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): ముచ్చటగా మూడోసారి నరేంద్ర మోదీ ప్రధాన మంత్రి కావడం ఖాయమని, ఆయన టీమ్‌లో తాము కూడా భాగస్వాములమయ్యే అవకాశాన్ని కలిగించాలని బీజేపీ లోక్‌సభ మహబూబాబాద్, వరంగల్ అభ్యర్థులు సీతారాం నాయక్, అరూరి రమేష్ ఓటర్లను అభ్యర్థించారు. తమను గెలిపిస్తే ఇద్దరం కలిసికట్టుగా ఉమ్మడి వరంగల్ జిల్లా అభివృద్ధికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. గురువారం హనుమకొండలోని వేద బాంక్వెట్ హాల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా సీతారామ్‌నాయక్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర సాధనకు శక్తివంచన లేకుండా కృషి చేసిన తనను దూరంగా పెట్టి తెలంగాణ ద్రోహులకు టికెట్లిచ్చారని విమర్శించారు. తెలంగాణ ఉద్యమం సందర్భంగా జగన్‌మోహన్‌రెడ్డిని మానుకోటకు తీసుకువచ్చిన రెడ్యానాయక్‌కు, ఆయన కూతురు కవితకు కేసీఆర్ టికెట్లిచ్చారన్నారు. అయినా కూడా తాను ఎంతో సహనంతో బీఆర్ఎస్‌లో కొనసాగినప్పటికీ చివరికి బయటకు వెళ్లిపోయే పరిస్థితిని కల్పించారన్నారు. తాను ఎంపీగా మహబూబాబాద్ నియోజకవర్గం అభివృద్ధికి ఎంతో కృషి చేశానని చెప్పారు. ములుగులో గిరిజన విశ్వవిద్యాలయం ఏర్పాటులో, రామప్పకు యునెస్కో గుర్తింపు తీసుకురావడంలో, కాజీపేటలో కోచ్‌ఫ్యాక్టరీ స్థానంలో ఓవర్ హాలింగ్ వ్యాగన్ వర్క్‌షాపు స్థాపనకు, ఇంకా ఇతరత్రా అనేక ప్రాజెక్టులు తీసుకురావడంలో ఎంతో కృషి చేశానని వివరించారు. తాను ఎంపీగా ఉన్నప్పుడు మహబూబాబాద్ లోక్‌సభ నియోజకరవ్గం పరిధిలో పలు అభివృద్ధి పనులు ముందుకు సాగకుండా కేసీఆర్ అడ్డుపడ్డారన్నారు.



బీజేపీలో చేరుతున్న పలువురు బీఆర్ఎస్ నాయకులు

తెలంగాణలో కేసీఆర్ అనుసరించిన పలు దుర్మార్గపు విధానాల వల్లనే కాంగ్రెస్ గెలిచిందని, అంతేకానీ ఆ పార్టీ పట్ల ప్రజల్లో ప్రేమ ఉండి కాదని సీతారామ్ నాయక్ పేర్కొన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి అనేక మాయమాటలు చెప్పి ప్రజలను మోసం చేసిందని ప్రొఫెసర్ సీతారామ్ విమర్శించారు. అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే అమలు చేస్తానని చెప్పిన వాగ్దానాల్లో ఒకటీ రెండు తప్ప.. ఏవీ అమలు కాలేదన్నారు రాష్ట్రంలో కాంగ్రెస్ వల్లనే కరువు వచ్చిందన్నారు. రాష్ట్రంలో కరువుకు గురైన మండలాలను ప్రభుత్వం ఎందుకు ప్రకటించడం లేదని ప్రశ్నించారు. దేశంలో సుస్థిర పాలన, సంస్కృతీ, సంప్రదాయాల పరిరక్షణ ఒక్క మోదీ వల్లనే సాధ్యమవుతుందని, ఆయనను చూసి ఓటేయ్యాలని సీతారామ్‌నాయక్ కోరారు. అయోధ్యలో రామమందిరం స్థాయిలో భద్రచాలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయాన్ని అభివృద్ధి చేయడానికి మోదీని లోక్‌సభ ఎన్నికల తర్వాత తీసుకువస్తానన్నారు. ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల్లో మొత్తం 17 స్థానాలు బీజేపీ ఖాతాలో పడేలా ఓటర్లు తమ సంపూర్ణ మద్దతు ప్రకటించాలని అభ్యర్థించారు.

వరంగల్ బీజేపీ అభ్యర్థి అరూరి రమేష్ మాట్లాడుతూ.. మోదీ ముచ్చటగా మూడోసారి ప్రధాని కాబోతున్నారని, ఆయన టీమ్‌లోకి తనను, సీతారామ్ నాయక్‌ను పంపించాల్సిందిగా ఓటర్లను అభ్యర్థించారు. తెలంగాణ ఉద్యమంలో చురుకుగా పని చేసిన తాను.. ఎమ్మెల్యేగా పదేళ్ల వర్ధన్నపేట నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేశానని చెప్పారు. వరంగల్ లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేసేందుకు అవకాశం వచ్చిందని, ఈ దృష్ట్యా ఓటర్లు తనను ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు. కడియం శ్రీహరి మాల, మాదిగల ద్రోహిగా అరూరి అభివర్ణించారు. ఆయన ఉపముఖ్యమంత్రిగా, ఎంపీగా, ఎమ్మెల్యేగా, ఎమ్మెల్సీగా టీడీపీలో, బీఆర్ఎస్‌లో పలు పదవులను అనుభవించినా ఎస్సీ సామాజికవర్గం అభ్యున్నతికి ఏ మాత్రం కృషి చేయలేదన్నారు. తన సొంత లాభం కోసం ఆరాటపడ్డారన్నారు. ఇప్పుడు తన కూతురును రాజకీయాల్లోకి తీసుకురావడానికి అడ్డదారులు తొక్కాడని విమర్శించారు. కడియం కూతురు, ప్రస్తుతం వరంగల్ లోక్‌సభ నియోజకవర్గం నుంచి పోటీకి దిగిన కావ్యకు వరంగల్‌తో ఏం సంబంధం అని ప్రశ్నించారు. ఆమె అత్తగారు ఊరు గుంటూరని అన్నారు. శ్రీహరి కుటిల రాజకీయాలతో మాలలు, మాదిగలను ఆగం చేశాడన్నారు. లోకసభ ఎన్నికల్లో కడియంకు ఓటర్లు బుద్ధి చెప్పాలని పిలుపు నిచ్చారు.

ప్రస్తుతం యావత్ ప్రపంచం మోదీ వైపు చూస్తోందని, దేశ సర్వతో ముఖాభివృద్ధికి, రక్షణకు మోదీ నాయకత్వం అవసరమని అరూరి రమేశ్ అభిప్రాయపడ్డారు. ప్రధాని మోదీ స్మార్ట్ సిటీ, అమృత్, గిరిజన విశ్వవిద్యాలయం, వ్యాగన్ వర్క్‌షాపు వంటి అనేక పథకాల ద్వారా వరంగల్‌కు ఎంతో చేశారన్నారు. ఈ విలేకరుల సమావేశంలో బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు, బీజేపీ మహబూబాబాద్ నియోజకవర్గం ఇన్‌చార్జి గరికెపాటి మోహన్‌రావు, మాజీ ఎంపీ చాడా సురేష్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు మార్తినేని ధర్మారావు, వన్నాల శ్రీరాములు, బీజేపీ నేత ఎర్రబెల్లి ప్రదీప్ రావు, రావు అమరేందర్ రెడ్డి, మాజీ మేయర్ డాక్టర్ టి.రాజేశ్వర్ రావు, బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ తదితరులు పాల్గొన్నారు.

అనంతరం బీఆర్ఎస్‌తో పాటు వివిధ పార్టీల నుండి పలువురు బీజేపీలో చేరారు. వీరికి గరికపాటి మోహన్ రావు, ప్రొఫెసర్ సీతారామ్‌నాయక్, ఆరూరి రమేష్‌లు కండువాలు కప్పి పార్టీలో చేర్చుకున్నారు ములుగు జిల్లా రైతు బంధు అధ్యక్షుడు పల్ల బుచ్చయ్య, రామప్ప పరిరక్షణ కమిటీ అధ్యక్షుడు పాలంపేట మాజీ సర్పంచ్ అకిరెడ్డి వెంకట రామ్మోహన్ రావు, ఏటూరునాగారం మాజీ ఎంపీటీసీ ఇర్రల్ల ఎల్లయ్య, బీఆర్ఎస్ ఏటూరు నాగారం కన్వీనర్ పల్ల బాబు, ఏటీఎంఏ డైరెక్టర్ పాపక శ్రీనివాస్‌తోపాటు పల్ల వెంకటేశ్వర్లు, పూజారి సూర్యనారాయణ, మధుకర్, నాగేశ్వర్‌రావు, పల్ల సృగన్, ఆకుతోట దుర్గయ్య తదితరులు వీరిలో ఉన్నారు. బీజేపీ ములుగు జిల్లా అధ్యక్షుడు సిరికొండ బలరాం, ములుగు జిల్లా ఇన్‌చార్జి పోలేపల్లి నరోత్తం రెడ్డి తదితరులు ఈ సందర్భంగా హాజరయ్యారు.

ఒకవైపు విధులు.. మరో వైపు కళలు..

- వ్యాఖ్యాత, రచయిత, గాయకుడిగా ప్రవీణ్‌కుమార్ రాణింపు
- హనుమకొండ జిల్లా బాలల పరిరక్షణ అధికారిగా విధులు



జూలైవాడ, ఏప్రిల్ 11: సభలోని ఆహుతులను తన మాటలతో ఆకట్టుకొని, సందర్భోచిత కవితలు, పాటల ద్వారా సభికులను ఉత్సాహపర్చడం వ్యాఖ్యాత విధి. సాహితీ, కళా ప్రక్రియలలో భాగమైన వ్యాఖ్యానానికి తనదైన శైలిలో న్యాయం చేస్తూ అందరి మన్ననలు పొందుతున్నాడు సౌరం ప్రవీణ్ కుమార్. హనుమకొండ జిల్లా మహిళలు, పిల్లలు, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ అనుబంధ సంస్థ జిల్లా బాలల పరిరక్షణ విభాగంలో బాలల పరిరక్షణ అధికారిగా (ఒప్పంద ప్రాతిపదికన) విధులు నిర్వహిస్తూ ప్రవృత్తి పరంగా కవిగా, రచయితగా, గాయకుడిగా, సాహిత్య, సాంస్కృతిక కార్యక్రమాలతోపాటు వ్యాఖ్యాతగా తన ప్రతిభను చాటుతున్నాడు.

చిన్ననాటి నుంచే కళారంగంపై ఆసక్తి

వరంగల్ జిల్లా సంగెం మండలం కాట్రపల్లి గ్రామానికి చెందిన సౌరం ప్రవీణ్‌కుమార్.. సంగెంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1991-92 విద్యా సంవత్సరంలో 10వ తరగతి విద్యనభ్యసించాడు. ఆ రోజుల్లోనే కళా రంగంపై ఆసక్తి పెంచుకున్నాడు. అనంతరం వరంగల్‌లో ఇంటర్, డిగ్రీ అనంతరం సోషల్ వర్క్‌లో పోస్టుగ్రాడ్యుయేషన్ పూర్తి చేశాడు. సాంస్కృతిక కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనడం, గ్రామ, మండల, జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయిలో అనేక వేదికలపై జానపద, సామాజిక చైతన్య గీతాలు పాడి ప్రముఖుల ప్రశంసలు పొందాడు.

పాటకు తొలి గురువులు

కళాశ్రీ ప్రవీణ్‌గా ద్వితీయ నామకరణంతో సాహితీ సాంస్కృతిక రంగంలో ఆరంగ్రేటం చేసిన ప్రవీణ్ కుమార్.. తొలుత పలు జానపద కళా బృందాలతో కలిసి వారి పాటలకు వంతపాడేవాడు. అనతికాలంలో దివంగత వరంగల్ శంకర్, దీకొండ సారంగపాణి లాంటి అగ్రశ్రేణి గాయకులతో కలిసి అనేక సాంస్కృతిక కార్యక్రమాలలో తనగళం వినిపించాడు. రచనా వ్యాసంగం వైపు దృష్టి మళ్లించి వర్ధమాన కవిగా, రచయితగా అనేక వేదికలపై తనను తాను నిరూపించుకున్నాడు. 2018 నుంచి ఇప్పటి వరకు ఉమ్మడి వరంగల్ జిల్లాలో ప్రభుత్వ కార్యక్రమం అయినా, ఏదేని సాహితీ సాంస్కృతిక కార్యక్రమమైనా వ్యాఖ్యాతగా కళాశ్రీ ప్రవీణ్ తన ప్రత్యేకతను చాటుకుంటున్నాడు.

ఉన్నతాధికారుల సహకారంతో..

ఇటీవల హైదరాబాద్ రవీంద్రభారతిలో కవుల సమక్షంలో చెత్తబండి దీర్ఘ కవిత సంపుటి ఆవిష్కరణ కార్యక్రమానికి వ్యాఖ్యాతగా వ్యవహరించి ప్రముఖులతో శభాష్ అనిపించుకొని అదే వేదికపై కణిక ఆత్మీయ పురస్కారం అందుకున్నాడు. ఉన్నతాధికారుల సహకారంతో జిల్లాలో నిర్వహించిన పలు కార్యక్రమాలకు వ్యాఖ్యాతగా వ్యవహరిస్తున్నారు.



వివిధ కార్యక్రమాలలో వ్యాఖ్యాతగా వ్యవహరిస్తున్న సౌరం ప్రవీణ్ కుమార్ (ఫైల్)

'కవి సాయంత్రం' ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షురాలిగా రాధిక నరేన్




వరంగల్ కల్చరల్, ఏప్రిల్ 11: సాహిత్య స్వచ్ఛంద సేవా సంస్థ, జనజాగృతి కళా సమితిలో అంతర్భాగమైన కవి సాయంత్రం సోషల్ మీడియా గ్రూప్ ఉమ్మడి వరంగల్ జిల్లా కమిటీలో ఉపాధ్యక్షురాలిగా కొత్తపల్లి రాధిక నరేన్‌ను నియమిస్తూ సంస్థ వ్యవస్థాపకుడు ముక్కెర సంపత్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. కవి సాయంత్రం అనేది సాహిత్య సంస్థలో ఒక భాగమన్నారు. రాధిక నరేన్ కవయిత్రిగా, రచయితగా అనేక కార్యక్రమాల్లో పాల్గొన్నారని, ఈ నేపథ్యంలో ఆమెను నియామకం చేసినట్లు, ఈ నియామకం రెండేళ్లపాటు కొనసాగుతుందని తెలిపారు.

పంచాయతీ కార్యదర్శులపై పనిభారం

పనులకు నిధులు లేక అవస్థలు

సొంత డబ్బుతో కొన్ని పనులకు వాడకం



హనుమకొండ టౌన్, ఏప్రిల్ 11: గ్రామ పంచాయతీ కార్యదర్శులపై పనిభారం పెరుగుతోంది. అన్ని పనులు వారి మీదే పడుతుండడంతో పంచాయతీ కార్యదర్శులు ఆర్థికంగా మానసికంగా ఒత్తిడికి గురవుతున్నారు. సర్పంచ్‌ల పదవీ కాలం ముగిసి ప్రత్యేకాధికారుల పాలన ప్రారంభమైనాటి నుంచి కార్యదర్శులకు కష్టాలు మొదలయ్యాయి. గ్రామ పంచాయతీల నిర్వహణ బాధ్యత మొత్తం కార్యదర్శులపైనే పడింది. ఆదాయానికి మించి నిర్వహణ ఖర్చులు అవుతుండటంతో తలలు పట్టుకుంటున్నారు. ప్రత్యేకాధికారులను నియమించినప్పటికీ కార్యదర్శులే అప్పులు చేసి పంచాయతీలను నిర్వహించాల్సిన పరిస్థితి నెలకొంది. గ్రామ పంచాయతీలో రావాల్సిన పన్నులు అంతంత మాత్రమే వసూళ్ల అవుతుండటంతో అప్పులు చేయక తప్పడంలేదు. ప్రస్తుతం 56 రకాల రికార్డులను నిర్వహిసున్నప్పటికీ కార్యదర్శులకు అదనంగా వాటర్ సప్లయికి సంబంధించి 7 రికార్డులను అప్పజెప్పడంతో పని ఒత్తిడి తప్పడంలేదు.

రాష్ట్ర ఫైనాన్స్ నిధులు కట్

పంచాయతీ అభివృద్ధికి గ్రామంలో పన్నుల ద్వారా వచ్చే ఆదాయంతో పాటు రాష్ట్ర ఫైనాన్స్, సెంట్రల్ ఫైనాన్స్ నుంచి వచ్చే గ్రాంటులను వినియోగిస్తుంటారు. కాగా, పన్నుల ద్వారా వచ్చే ఆదాయం అంతంతమాత్రమే కావడంతో మైనరు రిపేర్లు, పండుగల వేళ గ్రామంలోని దేవాలయాల ముస్తాబు, ఇతరత్రా ఖర్చులకే సరిపోతుంటుంది. మిగతా భారం అంతా సెంట్రల్, స్టేట్ ఫైనాన్స్ నుంచే వచ్చే గ్రాంటులపైనే ఆధారం. గ్రామంలో ప్రతీ తలపై రూ.162 చొప్పున సెంట్రల్, స్టేట్ ఫైనాన్స్‌లు కేటాయిస్తాయి. ఆయా గ్రామాల జనాభా లెక్కన గ్రాంటును విడుదల చేస్తుంటారు. కాగా, సుమారు 22 నెలల నుంచి స్టేట్ ఫైనాన్స్ నుంచి వచ్చే గ్రాంట్ నిలిపివేయడంతో పంచాయతీల్లో పనులు చేయించడం కార్యదర్శులకు తలకు మించిన భారంగా మారింది. కేంద్రం నుంచి వచ్చే గ్రాంటు మూణ్ణెళ్లకోసారి వస్తుండటంతో అప్పటికే గ్రామపంచాయతీ విద్యుత్ బిల్లు కుప్పగా తయారవుతోంది. మిగిలేది ఏమీలేక మిగతా ఖర్చులకు కార్యదర్శి జేబులో నుంచి వెచ్చించాల్సిన పరిస్థితి నెలకొంది.

మల్టీపర్పస్ వర్కర్స్‌కు అందని వేతనాలు

గ్రామపంచాయతీ పరిధిలో నివసిస్తున్న జనాభా ఆధారంగా మల్టీపర్పస్ వర్కర్స్‌ను గత ప్రభుత్వం నియమించింది. 500 జనాభాకు ఒక్కరు చొప్పున విధుల్లోకి తీసుకుంది. అయితే వీరికి గ్రామపంచాయతీ నుంచి వచ్చే ఆదాయం నుంచే ఒక్కొక్కరికి నెలకు రూ.9,500 జీతాలు చెల్లించాలని జీవో జారీ చేసింది. యేడాదికోసారి పన్నుల రూపంలో వచ్చే ఆదాయం గ్రామ అవసరాలకే సరిపోక మల్టీపర్పస్ వర్కర్స్ మూడు, నాలుగు నెలలుగా జీతాలు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మానవత్వం ఉన్న కార్యదర్శులు ఖర్చులో ఖర్చుంటూ అక్కడక్కడా వర్కర్స్‌కు చేతనైనంత ఆర్థిక సహాయం చేసి ఆదుకుంటున్నారు.

కార్యదర్శులకు యాప్‌ను తొలిగించాలి..

జె. అశోక్, పంచాయతీ కార్యదర్శుల సంఘం అధ్యక్షుడు

ప్రతీరోజు గ్రామంలోని నర్సరీ, శ్మశానవాటిక, చేత్తసేకరణ లాంటి 10 అంశాలకు సంబంధించి ఫొటో యాప్‌లో అప్‌లోడ్ చేయాలంటున్నారు. యాప్‌ను తొలిగించాలి. కారోబార్‌లను మల్టీపర్పస్ వర్కర్స్‌లో చేర్పడం వల్ల సుమారు 65 రికార్డ్‌లను నిర్వహించడం కష్టంగా ఉంది. కారోబార్లను కార్యదర్శులకు సహాయకులుగా నియమించాలి. పంచాయతీల అవసరాలకు సరిపడా నిధులులేక జేబుల్లో నుంచి పెట్టుబడి పెట్టి ఆర్థికంగా కుంగిపోతున్నాం. ఆ సమస్యను పరిష్కరించాలి.

అవకాశవాద రాజకీయ పార్టీలను ఓడించాలి

● ప్రజానాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కట్ట నర్సింహ


మాట్లాడుతున్న నర్సింహ

మహబూబాబాద్ రూరల్, ఏప్రిల్ 11 : అవకాశవాద రాజకీయ పార్టీల నాయకులను పోటీల్లో ఓడించాలని ప్రజానాట్య మండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కట్ట నర్సింహ పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని పెరుమాండ్ల జగన్నాథం భవన్‌లో గురువారం ప్రజానాట్య మండలి జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరంతరం ప్రజా సమస్యల పరిష్కారానికి పనిచేస్తున్న వామపక్ష లౌకికశక్తులను వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో గెలిపించాలన్నారు. అవకాశవాద, మతోన్మాదశక్తులను ఓడించడంలో ప్రజా కళాకారులు తమపాటల ద్వారా అవగాహన కల్పించాలన్నారు. బోనగిరి పార్లమెంట్ నుంచి పోటీ చేస్తున్న సీపీఎం అభ్యర్థి జహంగీర్ గెలుపు కోసం కళాకారులు కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో అల్వాల రామకృష్ణ, నక్క సైదులు, శ్రీనివాస్, చింత ఎల్లయ్య, కొమ్ము శ్రీనివాస్, ఉప్పలయ్య, మచ్చ వెంకన్న, అచ్చు నాగేష్, స్వామి, నరేందర్ పాల్గొన్నారు.

షార్ట్‌సర్క్యూట్‌తో మొక్కజొన్న చేను దగ్ధం

గూడూరు, ఏప్రిల్ 11 : మండలంలోని జంగుతండాలో విద్యుత్‌షార్ట్ సర్క్యూట్‌తో మొక్కజొన్న పంట దగ్ధమైన సంఘటన గురువారం చోటు చేసుకుంది. బాధితుడు మూడ్ భద్రునాయక్ తెలిపిన వివరాల ప్రకారం. జంగుతండా తండాకు చెందిన భద్రునాయక్ తనకున్న రెండెకరాల వ్యవసాయ భూమిలో మొక్కజొన్న పంటను సాగు చేశాడు. ప్రమాదవశాత్తు విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌కు గురై నిప్పులు మొక్కజొన్న పంటకు అంటుకున్నాయి. దీంతోపెద్ద ఎత్తున మంటలు వచ్చి రెండెకరాల్లో మొక్కజొన్న పంట పూర్తిగా దగ్ధమైంది. ఈ ఘటనలో సుమారు రూ.లక్ష వరకు నష్టం వాటిల్లిందని బాధితుడు భద్రు ఆవేదన వ్యక్తం చేశారు. ఆరుగాలం ఎంతో శ్రమించి మొక్కజొన్న పంటసాగు చేశానని, అది కాలిబూడిద కావడంతో తాను ఆర్థికంగా నష్టపోయానని ప్రభుత్వం తనను ఆదుకోవాలని బాధితుడు వేడుకున్నాడు.

ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడిగా భీమానాయక్



నెహ్రూసెంటర్, ఏప్రిల్ 11 : లంబాడ హక్కుల పోరాట సంఘం (ఎల్‌హెచ్‌పీఎస్) రాష్ట్ర అధ్యక్షుడిగా గుగులోతు భీమానాయక్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మహబూబాబాద్ జిల్లా కురవి మండలం తట్టుపల్లి శివారు చంద్యతండాకు చెందిన గుగులోతు భీమానాయక్ 25 ఏళ్లుగా లంబాడీల కోసం అహర్నిశలుగా కృషి చేస్తున్నారు. మహబూబాబాద్ జిల్లా అధ్యక్షుడిగా, ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జ్‌గా, రాష్ట్ర కోకన్వీనర్‌గా వివిధ పదవుల్లో కొనసాగారు. ఈనెల 10న హన్మకొండలోని గిరిజన భవన్‌లో నిర్వహించిన ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర ప్లీనరీలో ఆ సంఘం నాయకులు భీమానాయక్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా తన నియామకానికి కృషి చేసిన ప్రతీ ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు.

నెల్లికుదురు మజీద్ కమిటీ ఎన్నిక


మజీద్ కమిటీ సభ్యులు

నెల్లికుదురు, ఏప్రిల్ 11 : నెల్లికుదురు మజీద్ కమిటీని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మజీద్ సదర్‌గా యాకూబ్‌పాష, నయాబ్ సదర్‌గా అజ్జు, కార్యదర్శిగా అఫ్రోజ్, కోశాధికారిగా రఫీ, సభ్యులుగా సహేబ్‌పాష, సమ్మాన్, జాఫర్, సమీర్, ఇమ్రాన్, నవాజ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో కోఆప్షన్ సభ్యుడు రహిమాన్, సుబాని, అఫ్సర్‌పాష, జహార్‌పాష, బాబార్‌సాబ్, సిరాజ్, హనీఫ్ పాల్గొన్నారు.

బీజేపీలో పలువురి చేరిక

ములుగు, ఏప్రిల్ 11 : ములుగు జిల్లాకు చెందిన పలు వురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు బీజేపీలో చేరారు. కన్నాయిగూడెం మండలానికి చెందిన రైతుబంధు సమితి జిల్లా మాజీ అధ్యక్షుడు పల్ల బుచ్చయ్య, వెంకటాపూర్ మండలం పాలంపేటకు చెందిన రామప్ప పరిరక్షణ కమిటీ అధ్యక్షుడు ఆకిరెడ్డి రామ్మోహన్‌రావు సహా పలువురు కాషా యం తీర్థం పుచ్చుకున్నారు. హనుమకొండలో గురువారం జరిగిన కార్యక్రమంలో మాజీ రాజ్యసభ సభ్యుడు గరికపాటి మోహన్‌రావు వారికి కండువా కప్పి ఆహ్వానించారు. కార్యక్ర మంలో మహబూబాబాద్ ఎంపీ అభ్యర్థి అజ్మీరా సీతారాం నాయక్, జిల్లా అధ్యక్షుడు సిరికొండ బలరాం పాల్గొన్నారు.

మంత్రి కాన్వాయ్ తనిఖీ

ములుగు, ఏప్రిల్ 11: రాష్ట్ర మంత్రి సీతక్క కాన్వాయ్‌లోని వాహనాలను పోలీసులు గురువారం తనిఖీ చేశారు. మహ బూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలంలో లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో పాల్గొని ములుగుకు తిరిగి వస్తున్నారు. ఈ క్రమంలో మల్లంపల్లి చెక్‌పోస్టు వద్ద పోలీసులు వాహనాలను తనిఖీ చేశారు.


తొర్రూరులో పూలే విగ్రహానికి నివాళ్లర్పిస్తున్న ప్రజాసంఘాల నాయకులు, మునిసిపల్ చైర్మన్


మరిపెడలో పూలే చిత్రపటం వద్ద బీసీ సంక్షేమ సంఘం బాధ్యులు


మహనీయుల జీవితచరిత్ర పుస్తకాలను అందజేస్తున్న గుగులోతు కిషన్‌నాయక్


పూలే విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే మురళీనాయక్


మానుకోటలో పూలే విగ్రహానికి నివాళ్లర్పిస్తున్న కాళోజీ వాకర్స్ అసోసియేషన్ బాధ్యులు

మహాత్మాజ్యోతిరావు ఫూలేకు ఘన నివాళి

మహబూబాబాద్ రూరల్, ఏప్రిల్ 11 : జిల్లాలో అట్టడుగు వర్గాల ఆశాజ్యోతి మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి వేడుకలను గురువారం నిర్వహించారు. ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. జిల్లా కేంద్రంలోని ఇల్లందు రోడ్డులోని పూలే విగ్రహానికి స్థానిక శాసన సభ్యుడు భూక్య మురళీనాయక్ పూలమాల వేసి, నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల విద్యకు చైతన్యదీప్తి మహనీయులు పూలే అని కొనియాడారు. వారి ఆశయ సాధన కోసం పునరంకితం కావాలని విజ్ఞప్తి చేశారు. మా అసోసియేషన్ మా అసోసియేషన్ ఆధ్యక్షుడు బొడ్డుపల్లి ఉపేందర్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలో పూలే విగ్రహానికి పూలమాల వేసి, నివాళ్లర్పించారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ పాల్వాయి రామ్మోహన్‌రెడ్డి, మునిసిపల్ వైస్ చైర్మన్ మార్నేని వెంకన్న, చుక్కల ఉదయ్‌చందర్, ఘనపురపు అంజయ్య, ఖైస శ్రీనివాస్, పాలబిందెల మల్లయ్య, నల్లు సుధాకర్‌రెడ్డి, మందుల రఘు, దర్శనం రామకృష్ణ, ఇనుగుర్తి సుధాకర్, పరందామయ్య అంబాల శివకుమార్, రాందాస్, రాంచంద్రు, రాజేందర్, యాకయ్య ఉప్పలయ్య, వీరన్న పాల్గొన్నారు. గిరిజన సామాజిక చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు గుగులోతు కిషన్‌నాయక్ ఆధ్వర్యంలో ఎస్సీ స్టడీ సర్కిల్‌లో జ్యోతిరావుపూలె చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. అనంతరం స్టడీ సర్కిల్‌లో అభ్యర్థులకు మహనీయుల జీవిత చరిత్ర పుస్తకాలను అందజేశారు.

బహుజన స్టూడెంట్స్ యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. ఈ కార్యక్రమంలో రేపాకుల శ్రీనివాస్, మంద శశికుమార్, అనిల్, భాస్కర్‌రెడ్డి, వీరన్న, ప్రసాద్, చారి, వెంకన్న పాల్గొన్నారు. కాళోజీ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పూలె విగ్రహానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ డోలి సత్యనారాయణ, నామిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఖైస నాగయ్య పెద్ది వెంకన్న, పట్టాబి లక్ష్మయ్య, సోమ విష్ణువర్దన్, నాగేశ్వర్‌రావు, వెంకటేశ్వర్లు, మదుసూదన్‌రెడ్డి, రవీందర్, శ్యామ్‌రావ్, బిక్షం పాల్గొన్నారు. టీపీటీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలో చుంచు శ్రీశైలం, బొల్లం శ్రీనివాస్, ఉపేందర్, విద్యాసాగర్, విజయ్‌రాజ్, గోవర్దన్, వెంకటేశ్వర్లు,


కేసముద్రం పూలే విగ్రహానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

రామలింగారెడ్డి, గునిగంటి శ్రీను, సుధాకర్, బాబురావు పాల్గొన్నారు. సీపీఐ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలో జిల్లా కార్యదర్శి విజయ్‌సారథి, మునిసిపల్ ఫ్లోర్‌లీడర్ అజయ్ సారథిరెడ్డి, పెరుగుకుమార్, చిరంజీవి, రేషపల్లి నవీన్, చింతకుంట్ల వెంకన్న, నర్ర శ్రావణ్, మేక వీరన్న, వెలుగు శ్రావణ్, రమేష్, మల్లయ్య, శ్యాంప్రసాద్ పాల్గొన్నారు.

జ్యోతిరావు పూలే విగ్రహ స్ఫూర్తి ప్రదాత బీమ్లానాయక్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలో ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ పొక్కుల సదానందం, భూక్య వీరన్న, మధు, అశోక్, గణేష్, శ్రీనివాస్, రవీందర్, కుమార్, వీర్యానాయక్, భీమానాయక్ పాల్గొన్నారు. సీటీయూ ఆధ్వర్యంలో పెరుమాళ్ల జగన్నాథం భవన్‌లో జరిగిన కార్యక్రమంలో ఆకుల రాజు, కుమ్మరికుంట్ల నాగన్న, తోట శ్రీనివాస్ వాసం దుర్గారావు, సమ్మెట రాజమౌళి, శ్రీనివాస్, ఉప్పలయ్య, మచ్చ వెంకన్న, సైదులు పాల్గొన్నారు. కేవీపీఎస్ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో దుడ్డెల రామ్మూర్తి, బానోతు వెంకన్న, మహేందర్, ఆనంద్, సురేష్, గణేష్, ప్రశాంత్, వెంకన్న, నాగరాజు, రమేష్ పాల్గొన్నారు.

తెలంగాణ బీసీ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలో జిల్లా అధ్యక్షుడు దొంతోజు ఓంకార్, దాసరి మహేందర్, గునిగంటి శ్రీనివాస్, విద్యాసాగర్, చెన్నూరి శ్రీనివాస్, నాగేశ్వర్‌రావు ,ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి చాగంటి ప్రభాకర్ పాల్గొన్నారు.

వివిధ మండలాల్లో..

చిన్నగూడూరు దాశరథి సెంటర్‌లో గునిగంటి మోహన్ ఆధ్వర్యంలో జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లర్పించగా దొంగరి నర్సయ్య గ్రామస్తులు పాల్గొన్నారు.

● మరిపెడ మునిసిపల్ కేంద్రంలో బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. గుండగాని వేణు, నేతావత్ రవీందర్, సాయికుమార్, లింగమూర్తి, రమేష్, నాగార్జున, ప్రవీణ్, అక్కినపల్లి వెంకటసాయి పాల్గొన్నారు.

● దంతాలపల్లిలో జ్యోతిరావు పూలే చిత్రపటానికి యూత్ సభ్యులు పూలమాల వేసి, నివాళ్లర్పించగా మహేష్, శ్రీను, వెంకన్న పాల్గొన్నారు.

● పెద్దవంగర కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. కాంగ్రెస్ నాయకులు రంగు మురళీగౌడ్, ఓరుగంటి సతీష్, దాసరి శ్రీనివాస్, సీతారాంనాయక్, వేణు, రవీందర్‌రెడ్డి, వెంకన్న, మెట్టు నాగేష్, రాజు, సోమన్న, శ్రీనివాస్ పాల్గొన్నారు.

● తొర్రూరు మునిసిపల్ కేంద్రంలోని జ్యోతిరావుపూలే విగ్రహానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. దళిత రత్న సోమారపు ఐలయ్య, మునిసిపల్ చైర్మన్ రాంచంద్రయ్య, జడ్పీటీసీ మంగళంపల్లి శ్రీనివాస్, సురేందర్‌రెడ్డి, మహంకాళి బుచ్చయ్య, రాయిశెట్టి వెంకన్న, శ్రీను, రవి, ఉపేందర్, సంతోష్, వెంకటనారాయణ, మెరుగు మల్లేశం, కొమురయ్య వెంకన్న పాల్గొన్నారు.

● తొర్రూరు మండలం గుర్తూరులో పూలే చిత్రపటానికి బీఎస్పీ నాయకులు ఈదులూరి ప్రసాద్, మాజీసర్పంచ్ రవీంద్రాచారి, కుమార్, మాధవి, రమేష్, శంకర్, సంపత్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

● గార్ల పోలీస్‌స్టేషన్ సెంటర్‌లో ఉన్న జ్యోతిరావు పూలే విగ్రహానికి సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో పూలమాల వేసి నివాళ్లర్పించగా, మండల కార్యదర్శి కందునూరి శ్రీనివాస్, అంబటి వీరస్వామి, రామకృష్ణ, సత్యవతి, వంగూరి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

● బయ్యారంలోని పూలే, సావిత్రిబాయి పూలే విగ్రహాలకు పూలమాలలతో నివాళ్లర్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రంగన్న, రవీందర్, రామారావు, భాస్కర్‌తో పాటు స్థానికులు రాజేష్, గోవర్ధన్, వెంకన్న, రమేష్, రవినాయక్, ఉప్పలయ్య నాగేశ్వర్‌రావు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

● నెల్లికుదురు మండల కేంద్రంలో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. అశోద భాస్కర్, తిలక్‌బాబు, వెన్నాకుల శ్రీనివాస్, కొండపాక ఉప్పలయ్య, మాజీ సర్పంచ్ బీరవెల్లి యాదగిరిరెడ్డి, కన్నబోయిన విజయ్‌యాదవ్, కుమ్మరికుంట్ల మోనేందర్, వరిపెల్లి పూర్ణచందర్, వెన్నం క్రాంతి పాల్గొన్నారు.

● గూడూరు మండలం మచ్చర్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పూలే చిత్రపటానికి ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో పూలమాల వేసి నివాళ్లర్పించారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు పార్నంది రామయ్య, మోకాళ్ల వెంకన్న, కొండెం రజిత, మేడ వసంత, సీహెచ్. బాలయ్య వెంకన్న, యాకూబ్, జ్యోతి పాల్గొన్నారు.

● పూలే జయంతి సందర్భంగా కేసముద్రంలోని పూలె విగ్రహానికి కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు అల్లం నాగేశ్వర్‌రావు ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. టీపీసీసీ సభ్యుడు గుగులోత్ దస్రూనాయక్, బండారు దయాకర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎదళ్ల యాదవరెడ్డి, కూరెల్లి సతీష్, పొలెపల్లి వెంకట్‌రెడ్డి, నూకల వెంకటేశ్వర్లు, అంబేద్కర్ యువజన సంఘం మండల అధ్యక్షుడు వల్లందాస్ రవి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మందుల కృష్ణమూర్తి, పందుల సంజీవ, వేల్పుగొండ ఏలియా, సోమారపు శ్రీరాములు, నాగెల్లి శ్రీనివాస్, గద్దల యాకస్వామి పాల్గొన్నారు.

● కురవిలో సీపీఐ ఆధ్వర్యంలో పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి నల్లు సుధాకర్‌రెడ్డి, కన్నె వెంకన్న, బూర్గుల కృష్ణ, వీరభద్రం, రజిత, లక్ష్మమ్మ, రుక్మిణి పాల్గొన్నారు.

● ఇనుగుర్తి మండల కేంద్రంలో పూలే చిత్రపటానికి అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో పూలమాల వేసి నివాళ్లర్పించారు. ఈ కార్యక్రమంలో పప్పుల వెంకన్న, మహంకాళి రామ్‌సలీమ్, గోపందాస్ కృష్ణ, దీకొండ వెంకన్న, గుజ్జునూరి బాబురావు, బొబ్బిలి మహేందర్‌రెడ్డి, పింగిలి శ్రీనివాస్, బేతమల్ల చంద్రయ్య, గండు నాగన్న, పరిపాటి రాజేందర్, చిన్నాల కట్టయ్య పాల్గొన్నారు.

ఉరి వేసుకుని మహిళ ఆత్మహత్య

● మానుకోట పట్టణంలోని మిల్ట్రీకాలనీలో ఘటన

మహబూబాబాద్ రూరల్, ఏప్రిల్ 11 : ఉరి వేసుకుని ఓ వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన మహబూబాబాద్ పట్టణంలోని మిల్ట్రీకాలనీలో గురువారం చోటు చేసుకుంది. టౌన్ హెడ్‌కానిస్టేబుల్ లక్ష్మయ్య తెలిపిన వివరాల ప్రకారం. మిల్ట్రీకాలనీకి చెందిన బాపనపల్లి నిర్మల (56) భర్త నాగేశ్వర్‌రావుకు పక్షవాతం రావడంతో ఇంటి వద్దనే ఉంటూ జీవనం కొనసాగిస్తున్నారు. గత కొద్దిరోజుల నుంచి భార్యాభర్తల మధ్య ఘర్షణలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో నాగేశ్వర్‌రావు హైదరాబాద్‌లోని తన పెద్దకుమార్తె నీలవేణి వద్దకు బుధవారం సాయంత్రం వెళ్లాడు. ఏం జరిగిందో ఏమోగానీ ఇంట్లో ఎవరూ లేనిసమయంలో నిర్మల బుధవారం రాత్రి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. గురువారం తెల్లవారుజామున అటుగా వచ్చిన నిర్మల బంధువు రాజేష్ ఇది గమనించి, చుట్టుపక్కల వారికి సమాచారం అందించాడు. వారు పోలీసులకు ఫోన్‌చేసి సమాచారం అందించడంతో ఘటనా స్థలానికి వెళ్లిన పోలీసులు నిర్మల మృతదేహాన్ని కిందకు దింపి ఆమె భర్త, కుమార్తెలకు సమాచారం అందించారు. తర్వాత పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం నిర్మల మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అందజేశారు.

మృతురాలు నిర్మలకు భర్త నాగేశ్వర్‌రావు, కుమార్తెలు నీలవేణి, నీలమ్మ ఉన్నారు. పెద్ద కుమార్తె నీలవేణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ లక్ష్మయ్య తెలిపారు.

శ్రీకోదండ రామస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు

గూడూరు, ఏప్రిల్ 11 : మండలంలోని అప్పరాజుపల్లిలో నిర్మించిన శ్రీసీతాలక్ష్మణహనుమత్ సమేత శ్రీకోదండరామచంద్రస్వామి ఆలయంలో గురువారం విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి.గ్రామస్తులు హాజరై పూజారుల వేతమంత్రోచ్చరణలనడుమ విశ్వక్సేనపూజ, పుణ్యాహవచనం, రక్షాబంధనం,రుత్విక్‌వరణం, అంకురార్పణ, యాగశాల ప్రవేశం, అగ్నిప్రతిష్ఠ, ద్వారతోరణపూజ, మూర్తికుంబ అవాహన, మూలమంత్రహోమములు, నిత్యపూర్ణహుతి, తీర్థప్రసాదవితరణ, విష్ణుసహస్రనామ పారాయణం, మూలమంత, మూర్తిమంత్ర హోమాలు నిత్యాపూర్ణహుతి, మూలమూర్తులకు జల, క్షీర, దధి, పంచగవ్య, అదివాసములు, తీర్థప్రసాద కార్యక్రమాలను నిర్వహించారు.

రూ.50 లక్షలతో ఆలయ నిర్మాణం..

శ్రీకోదండరామచంద్రస్వామి ఆలయ నిర్మాణం కోసం దివంగత మాధవపెద్ది సోమ నర్సింహారెడ్డి స్మారకార్థం వారి కుమారుడు-కోడలు మాధవపెద్ది విజేందర్‌రెడ్డి- విజయ ఆలయ నిర్మాణం కోసం రూ.50 లక్షలను విరాళంగా అందించారు. గ్రామ మాజీ సర్పంచ్ మాధవపెద్ది విజయ-విజేందర్‌రెడ్డిలు మాట్లాడుతూ గ్రామంలో ఆధ్యాత్మికంగా అభివృద్ధి చేయాలన్న తలంపుతో ఆలయ నిర్మాణానికి తమవంతుగా 8 గుంటల స్థలంను విరాళంగా ఇచ్చినట్లు తెలిపారు. గ్రామంలో రూ.50 లక్షల రూపంలో విరాళాలు సేకరించి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్మాణం చేసినట్లు చెప్పారు. మాధవపెద్ది అమరేందర్‌రెడ్డి, రిటైర్డ్ తహసీల్దార్ మాధవపెద్ది వెంకట్‌రెడ్డి, వేముల వెంకన్న, చందర్, జయపాల్, సురేందర్ పాల్గొన్నారు.


శ్రీకోదండరామచంద్రస్వామి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న గ్రామస్తులు, అర్చకులు

భక్తిశ్రద్ధలతో రంజాన్

(5వ పేజీ తరువాయి)


డోర్నకల్‌లో ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలో పాల్గొన్న ముస్లింలు

ఈద్గా మైదానంలో ఉదయం 9 గంటల నుంచి 10వరకు ఈదుల్ ఫిత్ర్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. గౌసియా మసీద్ ఇమాం మౌలానా సయీద్ అహ్మద్ రిజ్వీ రంజాన్ పండుగ విశిష్టతపై హితబోధ చేశారు. అనంతరం రంజాన్ నమాజ్ చేయించారు. జిల్లా కేంద్రంలోని ముస్లింలే కాకుండా చుట్టు పక్కల సమీప గ్రామాల వారు ఉదయం 8.45 గంటల నుంచే ఈద్గా మైదానానికి చేరుకున్నారు. మత పెద్దల పర్యవేక్షణలో ఈద్గా మైదానంలో నమాజ్‌కు ఏర్పాట్లు చేశారు. షామియానాలు, నేలపైన ఏర్పాటు చేసిన గ్రీన్‌కార్పెట్లలో వేలాదిగా తరలివచ్చిన ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకొని పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అనంతరం వారు తమ దివంగతుల సమాధుల వద్దకు వెళ్లి పుష్పగుచ్ఛాలుంచి, శ్రద్ధాంజలి ఘటించారు. బంధు మిత్రులకు సేమ్యా పాయసం అందించారు.

ఆబాది ఈద్ గహ్‌లో..

జిల్లా కేంద్రంలోని కంకరబోడు ఇందిరా గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన ఆబాది ఈద్ గహ్ మైదానంలో రంజాన్ వేడుకలను నిర్వహించారు. ఆబాది ఈద్ గహ్ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేయగా ముస్లీం మతపెద్ద అబ్దుల్ హమీద్ ముస్లింలచే నమాజ్ చేయించారు. మరో మతపెద్ద ముక్తీ ఆలంగీర్ రంజాన్ పండుగ ప్రాధాన్యతను వివరించారు. ఈ వేడుకల్లో న్యూ ఆబాది ఖబరస్తాన్, ఈద్ గహ్ కమిటీ బాధ్యులు పాల్గొన్నారు.

వివిధ మండలాల్లో..

మరిపెడలోని ఈద్గా మైదానంలో జరిగిన రంజాన్ వేడుకలో ప్రభుత్వవిప్, డోర్నకల్ ఎమ్మెల్యే జాటోతు రాంచం ద్రునాయక్ పాల్గొని ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రాంచంద్రునాయక్ మాట్లాడుతూ పవిత్రకు ప్రతీక రంజాన్ పండుగ నిలుస్తుందన్నారు. నరేష్‌రెడ్డి, ఒంటికొమ్ము యుగేందర్ రెడ్డి, రఘువీర్‌రెడ్డి, తాజోద్దీన్, అఫ్సర్, అఫ్జల్, ముస్లిం మతపెద్ద మౌలానా, షాజహన్ పాల్గొన్నారు.

● మరిపెడ మండలంలోని గిరిపురం, అనేపురం, ఎల్లంపేట, రాంపురం, ఎడ్జెర్ల గ్రామాల్లో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

● తొర్రూరులోని జామ మసీదు, ఈద్గాలో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అబ్దుల్ ఆలీమ్, అలీ, మౌలానా, వహీద్, బషీర్, అమీర్, జలీల్, యాకూబ్‌పాష, చాంద్‌పాష, రహీం పాల్గొన్నారు.

● చిన్నగూడూరు మండలం ఉగ్గంపల్లిలో మాజీ కోఆప్షన్ సభ్యుడు అయూబ్ పాష ఇంటికి మాజీ ఎమ్మెల్యే డీఎస్.రెడ్యానాయక్ హాజరై కుటుంబసభ్యులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఆయన వెంట ముత్యం సత్యనారాయణ, బెల్లం కొండ శ్రీనివాస్, బీసు మల్లేశం, బర్తపురం కొమురెల్లి ఉన్నారు.

● దంతాలపల్లితోపాటు పెద్దముప్పారం, దాట్ల, కుమ్మరికుంట్లలో ముసింలు ప్రార్థనలు నిర్వహించారు. మాజీ సర్పంచ్ రవీందర్, కృష్ణ, సుష్మిత పాల్గొన్నారు.

● పెద్దవంగర మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాల్లో ముస్లిం సోదరులు ప్రార్థనలు నిర్వహించారు.

● గార్లలో ఈద్గావద్ద ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించగా, అబ్దులా, మౌలాన, షఫీయొద్దీన్, బుర్హాన్, జాన్‌ఖాన్, జానీ పాల్గొన్నారు.

● బయ్యారంలోని జామీయా మస్జీద్‌లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ వేడుకల్లో మతపెద్దలు, ముస్లింలు పాల్గొన్నారు.

● డోర్నకల్ మునిసిపల్ కేంద్రంతో పాటు అన్ని గ్రామాల్లోని మస్జీద్‌లు, ఈద్గాల వద్ద ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. డోర్నకల్‌లో మునిసిపల్ చైర్మన్ వాంకుడోతు వీరన్న, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు సుమీర్‌చంద్‌జైన్, మాద శ్రీనివాస్ ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.

● కొత్తగూడలో ఈద్గావద్ద ముస్లీంలు ప్రార్థనలు నిర్వహించారు. మతపెద్దలు ముదసిర్, అజ్మీర్, యాకూబ్‌పాష, యాకూబ్, మౌలానా, సయ్యద్, ఇమ్రాన్, దస్తగిరి పాల్గొన్నారు.

● నెల్లికుదురుతో పాటు మునిగలవీడులో రంజాన్ ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఎండీరెహమాన్, యాకూబ్‌పాషా, షేక్ రఫీ, అఫీజ్, రబ్బాన్, నూరుద్దీన్, రహెమత్, దస్తగిరి, ముస్లింలు పాల్గొన్నారు.

● నర్సింహులపేటతో పాటు కొమ్ములవంచ, రామన్నగూడెం, పెద్దనాగారం, జయపురం, పడమటిగూడెం గ్రామాల్లో రంజాన్ ప్రత్యేక ప్రార్థనల్లో ముస్లింలు పాల్గొన్నారు. మైనార్టీసెల్ జిల్లా నాయకుడు రఫీ, సర్వర్‌పాష, మోహినోద్దీన్, అమీర్‌పాష, నయీంపాష పాల్గొన్నారు.

● గూడూరులో జడ్పీ కోఆప్షన్ సభ్యుడు ఖాసీం, మస్జీద్ కమిటీ అధ్యక్షుడు షేక్.ఖాసీం, గౌరవ అధ్యక్షుడు మహ్మద్ సలీమ్, ఎండీ రఫీ, ఎస్‌కె.యాకూబ్, అంజు, సలీమ్, ఖదీర్, రహీమ్‌తో పాటు ముస్లింలు ఆయా ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు పాల్గొన్నారు.

● కేసముద్రం ఈద్గా వద్ద ముస్లింలు ప్రార్థనలు నిర్వహించారు. కేంద్ర మాజీమంత్రి బలరాంనాయక్ కేసముద్రంలోని షేక్ ముజీబ్అక్తర్, ఎండీతాజొద్దిన్‌ల ఇంటికి వెళ్లి సోదరులకు పండుగ శుభాకాంక్షలను తెలిపారు. టీపీసీసీ సభ్యుడు గుగులోత్ దస్రూనాయక్, మండల పార్టీ అధ్యక్షుడు అల్లం నాగేశ్వర్‌రావు, బండారు దయాకర్, మేకల వీరన్న, పోలెపల్లి వెంకట్‌రెడ్డి, రావుల మురళి, గండి శ్రీనివాస్, నూకల వెంకటేశ్వర్లు, ధరావత్ బాలు, గుగులోత్ వెంకన్న, బానోత్ వెంకన్న పాల్గొన్నారు.

● ఇనుగుర్తిలో ఈద్గా వద్ద ముస్లింలు ప్రార్థనలు చేశారు. షేక్ యాకూబ్, వహెద్, తాజొద్దీన్ ఖాన్, నబీ, రహీం, ఫిరోజ్, అమీర్, ఖలీల్ పాల్గొన్నారు.

● కురవి ఈద్గా వద్ద ముస్లింలు రంజాన్‌ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఒకరినొకరు రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ వేడుకల్లో రషీద్, రహీం, మహబూబ్, జానీ, జహంగీర్, నవాజ్, బాబ్‌జానీ పాల్గొన్నారు.

●రంజాన్ పర్వదినం సందర్భంగా ముస్లిం సోదరులకు మాజీమంత్రి, ఎమ్మెల్సీ సత్యవతిరాథోడ్, మానుకోట ఎంపీ మాలోతు కవిత, మాజీ ఎమ్మెల్యే శ్రీరాం భద్రయ్య, బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు వి.రాజవర్దన్‌రెడ్డి ఫోన్‌ద్వారా శుభాకాంక్షలు తెలిపారు.


ఉగ్గంపల్లిలోరంజాన్ శుభాకాంక్షలు తెలుపుతున్న మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్

ప్రమాదవశాత్తు నీటిగుంతలో పడి వృద్ధుడి మృతి


పబ్బతి రామచంద్రు (ఫైల్)

పెద్దవంగర, ఏప్రిల్ 11 : పాడి గేదెలకు గడ్డికోసి కాళ్ల చేతులు కాడుక్కునేందుకు నీటిగుంత వద్దకు వెళ్లగా, ప్రమాదవశాత్తు అందులో పడడంతో ఓ వృద్ధుడు మృతి చెందిన సంఘటన చిన్నవంగర గ్రామంలో చోటు చేసుకొంది. ఎస్సై బానోతు మహేష్ కథనం ప్రకారం. చిన్నవంగర గ్రామానికి చెందిన పబ్బతి రామచంద్రు (65) బుధవారం తనకు ఉన్నటువంటి పాడి గేదెలకు రోజు వారీగా గ్రామశివారులోని పెద్దబండ సమీపంలో గడ్డి కోసి పక్కనున్న నీటి కుంటలో కాళ్ల చేతులు కడుక్కునేందుకు వెళ్ళగా ప్రమాదవశాత్తు నీటిగుంతలో పడ్డాడు. రామచంద్రు సాయంత్రం ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆచూకీ కోసం సమీప బంధువుల, గ్రామస్థుల ఇంట్లో వెతి కిన ఆచూకీ లభించలేదు. కాగా, కుటుంబ సభ్యులకు, గ్రామ స్థులకు గురువారం నీటి కుంటలో రామచంద్రు మృతదేహం లభించింది. మృతుడి కుమారుడు పబ్బతి సంతోష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి శవపంచనామా నిమిత్తం ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై తెలిపారు.

అబద్ధాలతో గద్దెనెక్కిన కాంగ్రెస్

ఏటూరునాగారం (ములుగు జిల్లా), ఏప్రిల్ 11 : ఆరు గ్యారం టీల పేరుతో తెలంగాణ ప్రజలను మోసం చేసి కాంగ్రెస్ పార్టీ గద్దెనెక్కిందని బీఆర్ఎస్ మహబూబాబాద్ ఎంపీ అభ్యర్థి మాలోతు కవిత అన్నారు. కాంగ్రెస్ పార్టీవి 420 హామీ లన్నారు. ఏటూరునాగారం మండల కేంద్రంలోని బీఆర్ఎస్ ఫంక్షన్ హాల్‌లో గురువారం మహబూబాబాద్ పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశం జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మీనరసింహారావు అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథులుగా కవిత, ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్ జడ్పీ చైర్‌పర్సన్ బడే నాగజ్యోతితో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ అభ్యర్థి కవిత మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను ప్రజలు దేవుడిలా కొలుస్తున్నారని అన్నారు. రాష్ట్రంలోని ప్రజల సంక్షేమం కోసం కేసీఆర్ ఎన్నోసంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి ప్రజల మదిలో గూడుకట్టుకున్నారని తెలిపారు. ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఉచిత విద్యుత్ హామీని అమలు చేయకపోవడంతో రాష్ట్రంలో పంట పొలాలు ఎండిపోయి రైతులు కన్నీరు పెడుతున్నారన్నారు. ప్రజల సమస్యలు పరిష్కారం కావాలంటే బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కవితను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. సమావేశంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ పోరిక గోవిందనాయక్, జడ్పీ కోఆప్షన్ సభ్యురాలు ఎమ్డీ.వలియాబీ, ఎంపీపీ అంతటి విజయ పాల్గొన్నారు.